ప్రజాశక్తి
శుక్రవారం 20 జనవరి 2023
5

24న బీఫార్మసీ, ఫార్మాడీ సీట్లకు అడ్మిషన్లు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు అనుబంధ ఓటీపీఆర్‌ఐ కళాశాలలో మిగిలిన బీ.ఫార్మసీ, ఫార్మాడీ కన్వీనర్ కోటా సీట్లకు స్పాట్ అడ్మిషన్లను ఈనెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు జెఎన్‌టియు అడ్మిషన్స్ డైరెక్టర్ బి.ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు జెఎన్‌టియు పరిపాలన భవనం అడ్మిషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఒరిజినల్ సరిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను కూడా తీసుకుని రావాలన్నారు. సీటు పొందే విద్యార్థులు ప్రాసెసింగ్, ట్యూషన్ ఫీజులను చెల్లించాల్సి ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్ సీటు పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్ మెంట్‌కు అర్హులు కాదన్నారు. మరిన్ని వివరాల కోసం www.jntua.ac.in వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు.

చైతన్య పద్యం.. వేమన సాహిత్యం..!

వేమన విగ్రహ ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రోజా, ఎమ్మెల్యేలు, జెడ్పీ ఛైర్‌పర్సన్, కలెక్టర్

- సామాజిక రుగ్మతలు పారదోలేలా రచనలు
- పిల్లలు అందరికీ వేమన పద్యాలు నేర్పాలి
- గాండ్లపెంటను శ్రీయోగి వేమన కటారుపల్లి మండలంగా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన
- రాష్ట్ర పర్యటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా
- కటారుపల్లిలో ఘనంగా వేమన జయంతి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గాండ్లపెంట

అనాటి సమాజంలో వేల్లూనుకున్న సామాజిక రుగ్మతలు, అసమానతలను పారదోలి ప్రజలను చైతన్య వంతం చేసేలా మహాకవి యోగి వేమన తన సాహిత్యంతో పద్యాలు రచించారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా పేర్కొన్నారు. గాండ్లపెంట మండలం కటారుపల్లి గ్రామంలోని వేమన సమాధి వద్ద శ్రీ యోగి వేమన రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభం అయ్యాయి. వేమన సమాధి, ఆలయాన్ని మంత్రి సందర్శించారు. అనంతరం జడ్పీ హైస్కూల్ ఆవరణలో జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, ఎమ్మెల్యేలు సిద్ధారెడ్డి, శంకర్ నారాయణ, కలెక్టర్ బసంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ వేమన గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భావి తరాలకు స్ఫూర్తిగా వేమన సాహిత్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సంకల్పించారన్నారు. 350 సంవత్సరాల క్రితం మహాకవి వేమన పద్యాలు నేటికీ ఎంతో ప్రాచుర్యాన్ని పొందుతున్నాయంటే అందులోని గొప్పదనాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. అనాటి సమాజంలోని రుగ్మతలను పారదోలి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన పద్య రచన శైలితో యోగివేమన చైతన్యవంతం చేశారన్నారు. వేమన పద్యాల సారాంశాలను తల్లిదండ్రులు పిల్లలకు తెలియజేయాలన్నారు. వేమన పద్యాలు లోక నీతులని, సామాజిక చైతన్యం వేమన పద్యాల లక్షణమని తెలిపారు. సామాజిక, కుటుంబ వ్యవస్థల్లోని లోటుపాట్లు, సామాజిక అస్థవ్యస్థత, సామాజిక జీవనంలోని ప్రతి అంశం మీద వేమన పద్యాలు చెప్పారని వారు చెప్పారన్నారు. గాండ్లపెంట మండలాన్ని ఇకనుంచి శ్రీ యోగివేమన కటారుపల్లి మండలంగా నామకరణ చేయడానికి ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్లు చెప్పారు. కటారుపల్లికి తారు రోడ్డు పనులకు టెండర్లు పిలిచామని, ఫిబ్రవరి మాసం నుంచి రోడ్డు పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మాట్లాడుతూ లోకకవి వేమన అన్నారు. వేమన రచనలు ఆంగ్ల, ఐరోపా భాషలలో అనువదించారన్నారు. కలెక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ వేమన పద్యాలు వినని తెలుగు వారు లేరంటూ అతిశయోక్తి కాదన్నారు. ఆయన రాసిన ప్రతి పద్యం ఒక ఆణిముత్యం అని తెలిపారు. అనంతరం యోగి వేమన వంశస్తులు టి.వేమారెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, చెన్నారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలను మంత్రి సన్మానించారు. ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు నిర్వహిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టు కున్నాయి. ఈ కార్యక్రమంలో రెడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ కాపు భారతి, ఎంపిపి జగన్, వైసిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, టూరిజంశాఖ అధికారులు నాగేశ్వర్ రెడ్డి, డివిఎం.ఈశ్వరయ్య, తహశీల్దార్ రవి, ఎంపిడిఒ ఆంజనేయ, జెడ్పీటీసీ అమరావతి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఫయాజ్ అలీ, వైఎస్ ఎంపిపి గంగోజమ్మ, సర్పంచి గంగోజమ్మ రవీంద్ర నాయక్, యోగి వేమన రెడ్డి సంఘం ప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వేమన ఆలయంలో గోడపై ఏర్పాటు చేసిన వేమన పద్యాలను చూస్తున్న మంత్రి రోజా

అవస్థల ముఖహాజరు

ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు అందరికీ ఈ నెల 17వ తేదీ నుంచి ప్రభుత్వం ముఖహాజరు నమోదును తప్పనిసరి చేసింది. ఉదయం 10 గంటలకు కార్యాలయానికి రాగానే ఆన్‌లైన్‌లో ముఖ హాజరు నమోదు వేయాలి. సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో కూడా ముఖహాజరు నమోదు చేసి వెళ్లాలి. 10 గంటలు దాటితే ఆరోజు ఉద్యోగి విధులకు హాజరుకాలేదని భావించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నిబంధనపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

- ఉద్యోగులకు ఫేస్‌యాప్ తప్పనిసరితో తిప్పలు
- ఉదయం, సాయంత్రం వేయాల్సిందే..
- కాంట్రాక్టు ఉద్యోగులు కూడా..
- పది గంటలు దాటితే గైర్హాజరు
- వెంటాడుతున్న సాంకేతిక సమస్యలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 1400 వేలకు పైగా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో 41 వేలకుపైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ప్రతి రోజూ వీరు కార్యాలయానికి వెళ్లగానే రిజిస్టర్‌లో సంతకాలు చేసేవారు. ప్రస్తుతం దీనికి అదనంగా ముఖ హాజరును ప్రభుత్వం తప్పని సరి చేసింది. ఉదయం 10 గంటల్లోపు ముఖహాజరులో వారి హాజరు నమోదు కావాలి. ఉద్యోగుల హాజరు నమోదు వివరాలు పరిశీలించే బాధ్యతను వేతనాలు చెల్లించే జిల్లా ఖజనా శాఖ కార్యాలయానికి అప్పగించారు. పూర్తి స్థాయి ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా ముఖహాజరును నమోదు చేయించుకోవాలి. ముఖ హాజరును ఏపీ సెంటర్‌ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్, సర్వీసెస్ నిర్వహించనుంది. ప్రతి ఉద్యోగి తన ఆండ్రాయిడ్ ఫోన్లో మాత్రమే యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఉద్యోగులు పని చేసే కార్యాలయాలను సెంటర్ పాయింట్‌గా చేసుకుని ఆ పరిసరాల్లో 200 మీటర్లలోపు మాత్రమే యాప్ పని చేస్తుంది. ఫోన్లకు జియోట్యాగ్ అనుసంధానం చేసినందున ఆ ప్రాంతానికి దూరంగా ఉంటే యాప్ పని చేయదు. ఇలా ప్రతి రోజూ ఉద్యోగి వారి కార్యాలయానికి సమీపంలో ముఖ హాజరు నమోదు చేయాలి.

అనేక సమస్యలు... ఉద్యోగుల్లో టెన్షన్

ముఖ హాజరు వేసేందుకు అనేక సమస్యలు ఉన్నాయి. దీంతో ఉద్యోగుల్లో టెన్షన్ మొదలైంది. ప్రభుత్వం నిర్ణయించిన సమయం లోపు ముఖహాజరు వేయకుంటే ఆరోజు విధులకు ఆలస్యం అయినట్లు పరిగణిస్తారు. మూడు సార్లు ఆలస్యంగా వేస్తే ఒక సిఎల్ కింద పరగణిస్తారు. సాయంత్రం వేయకుంటే సగం రోజు మాత్రమే పని చేసినట్లు లెక్కలోకి వస్తుంది. ఈ హాజరు ఆధారంగానే వేతనాలు చెల్లింపులూ ఉంటాయి. మండల స్థాయిలో పనిచేసే ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఉపాధి సిబ్బంది, ఇంజినీరింగ్ తదితర విభాగాధికారులు ఎక్కువ శాతం క్షేత్రస్థాయి పరిశీలన చేయాల్సి ఉంది. వీరంతా ప్రతి రోజు వారు పనిచేసే కార్యాలయానికి వచ్చిన తరువాతనే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలి. సాయంత్రం కూడా తప్పని సరిగా కార్యాలయానికి రావాల్సి ఉంటుంది.

వెంటాడుతున్న సాంకేతిక సమస్యలు

ఫేస్‌యాప్‌కు సంబంధించి సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో కార్యాలయాలు ఉండే ఉద్యోగులకు మరింత సమస్యలు తెచ్చి పెడుతున్నాయి. సాంకేతిక సమస్యల కారణంగా యాప్ పని చేయడం లేదు. గత మూడు రోజులుగా పలు చోట్ల ఉద్యోగులు యాప్ పని చేయక ఇబ్బందులు పడ్డారు. సాంకేతిక పరిజ్ఞానం తక్కువ ఉన్న ఉద్యోగులు మరింత అవస్థలు పడుతున్నారు. సమయానికి కార్యాలయానికి చేరుకోకున్నా, సాంకేతిక సమస్యలు ఉత్పన్నం అయినా ఆరోజు విధులు నిర్వహించినా హాజరు నమోదు అవదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ముఖ హాజరును తప్పనిసరి చేస్తున్నారని, ప్రభుత్వ అధికారులను ఇలా ఇబ్బందులకు గురి చేయడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ బసంత్ కుమార్

ప్రజాశక్తి - కదిరి టౌన్

రహదారులపై ప్రయాణించేటప్పుడు వాహన చోదకులు అప్రమత్తతతో ముందుకు సాగాలని కలెక్టర్ బసంత్ కుమార్ సూచించారు.జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక కాలేజ్ గ్రౌండ్‌లో పట్టణంలోని లారీ, మిని లారీ, ఆటో, టాక్సీ, స్కూల్ బస్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ బసంత్ కుమార్, జిల్లా రవాణా అధికారి కరుణాసాగర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహన చోదకులు రహదారి భద్రత సూచనలు తప్పక పాటించాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడున్న వారు స్పందించి ప్రమాదానికి గురైన వారికి సహాయ సహకారాలు అందించి తగు వైద్య సదుపయాలు కల్పించగలిగితే మరణాల సంఖ్య తగ్గించ వచ్చునన్నారు. అలాగే స్పందించిన వారిని పోలీస్ వారి ద్వారా గాని వైద్య సిబ్బంది ద్వారా గాని ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా చట్ట సవరణ చేయడం జరిగిందన్నారు. అనంతరం కలెక్టర్ జెండా ఊపి రహదారి భద్రతావారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహనాల తనిఖీ అధికారి వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు, వాహన డీలర్లు, స్కూల్ బస్ యాజమాన్యం, లారీ, ఆటో, టాక్సీ డ్రైవర్లు, స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పేదలపై విద్యుత్ భారాలు తగదు : సిపిఎం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పేదలపై విద్యుత్ భారాలు మోపడం ప్రభుత్వానికి తగదని సిపిఎం నాయకులు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుదలపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో నేపథ్యంలో గురువారం ఏపీ ట్రాన్స్‌కో కదిరి డివిజన్ డిఇ మోజేష్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి, కదిరి పట్టణ కార్యదర్శి జిఎల్. నరసింహులు, నాయకులు రామ్మోహన్, బాబ్జాన్, ఫైరోజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 21 వరకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి విద్యుత్ ప్రతిపాదనపై ప్రజల అభిప్రాయా సేకరణ చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ ఛార్జీలు మోపేందుకు పన్నాగం పన్నుతోందని అనుమానం వ్యక్తం చేశారు. కార్పొరేట్‌కు అనుకూలంగా పేదలపై పన్నుల భారం మోపడం తగదన్నారు. కదిరి పట్టణ ప్రజలు ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకించాలని కోరారు. 2023-24 సంవత్సరానికి లోటుగా విద్యుత్ నియంత్రణ మండలి చూపిస్తున్న 13 వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీగా చెల్లించాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే విధానాన్ని రద్దు చేయాలని, ఇప్పటికే ప్రజల నుంచి వసూలు చేస్తున్న ట్రూప్ చార్జీలను రద్దు చేయాలని, ఎస్సీ, ఎస్టీ ఇతర బలహీన వర్గాలకు సంపూర్ణంగా ఉచిత విద్యుత్ అందించాలని, ప్రతినెల విద్యుత్ ఛార్జీలను సవరించాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ట్రాఫిక్ పోలీస్ నియామకానికి చర్యలు : డిఐజి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విలేకరులతో మాట్లాడుతున్న డిఐజి రవిప్రకాష్

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్ హెచ్చరించారు. గురువారం సత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఐజి మాట్లాడుతూ కొత్త జిల్లా ఏర్పడిన అతి కొద్ది కాలంలోనే ఎస్పీ కార్యాలయం పనితీరు బాగుందని సంతప్తి వ్యక్తం చేశారు. డీఎస్పీలు, కానిస్టేబుళ్ల కొరత ఉందని, త్వరలోనే వాటి భర్తీకి కషి చేస్తామన్నారు. జిల్లాలో కదిరి, హిందూపురం పట్టణాల్లో మత ఘర్షణలు జరిగే అవకాశం ఉందని, సున్నితమైన సమస్యల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో అక్కడక్కడ ఫ్యాక్షన్ గ్రామాలు ఉన్నాయని వాటిపై నిరంతర నిఘా ఉంచామన్నారు. మహిళలపై అత్యాచారాలు, పిల్లల కిడ్నాప్, ఇతర ప్రాంతాల నుంచి మద్యం తరలింపు, నాటుసారా తయారీ, దొంగతనాలు, హత్యలు తదితర కేసులను త్వరగతిన ఛేదించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. ట్రాఫిక్ పోలీస్ అవసరం ఉందని, త్వరలోనే ట్రాఫిక్ పోలీసును నియమిస్తామన్నారు. పుట్టపర్తికి దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగనివ్వకుండా పోలీస్ గస్తీ నిరంతరం ఉంటుందన్నారు. వీఐపీలు వస్తుంటారని అందుకు తగిన బందోబస్తు నియమిస్తామన్నారు. ప్రజలలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా గ్రామసభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని ఎస్పీకి సూచించామన్నారు. ఈ సమావేశంలో ఎస్పి రాహుల్ దేవ్ సింగ్, అదనపు ఎస్పి రామకృష్ణ ప్రసాద్, డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీవో ఎదుట నిర్వాసితుడి ఆత్మహత్యాయత్నం

నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్

బాధిత రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి ముదిగుబ్బ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా చేపట్టిన గ్రీన్ వే రహదారి నిర్మాణం కోసం తమ జీవనాధారమైన సాగు భూములు కోల్పోతున్నామని తమకు సంతృప్తికరమైన పరిహారం అందించాలని నిర్వాసిత రైతులు కోరారు. గురువారం మండల పరిధిలోని కొండగట్టుపల్లి మలక వేముల క్రాసులో భూములను సర్వే చేయాలని వచ్చిన ధర్మవరం ఆర్డీవో తిప్పానాయక్ ఎదుట నిర్వాసిత రైతులు తమ సమస్యను విన్నవించారు. ఈసందర్భంగా కొండగట్టుపల్లి గ్రామానికి చెందిన రైతు నరేష్ పురుగుల మందు తాగడానికి ప్రయత్నించగా స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. ఎకరాకు రూ. 3లక్షల నుంచి 5 లక్షల రూపాయల వరకు వచ్చేలా చర్యలు తీసుకుంటానని కొండగట్టుపల్లి రైతులకు అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం మలక వేమల క్రాస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు తమ నిర్ణయాన్ని వెలుబుచ్చారు. తాము తమ భూములు ఇవ్వడానికి అనుకూలంగా లేమని ప్రభుత్వం ఇచ్చే పరిహారం చాలా తక్కువగా ఉందనితమకు రెండు రోజులు గడువు ఇస్తే నిర్ణయించుకొని తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని రైతులు ఆర్డీవోకు చెప్పారు.

ముగిసిన విగ్రహ ఏర్పాటు వివాదం

హిందూపురం : హిందూపురం పట్టణంలో శ్రీకృష్ణ దేవరాయులు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఆగ్రోస్ ఛైర్మెన్ నవీన్ నిశ్చల్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా విగ్రహం ఏర్పాటు పనులు చేయడానికి, బలిజ సంఘం నాయకులు ప్రయత్నించడం, పోలీసులు అడ్డుకోవడంతో అది వివాదంగా మారింది. విగ్రహ ఏర్పాటు సున్నితమైన అంశం కావడం, అది వివాదంగా మారడంతో చివరకు మున్సిపల్ పాలక వర్గం అనుమతి ఇచ్చింది. ఇక్కడి పరిస్థితిని గుర్తించిన ఉన్నతాధికారులు సైతం మౌఖికంగా ఆదేశాలు ఇవ్వడంతో ఆగ్రోస్ ఛైర్మెన్ నవీన్ నిశ్చల్ గురువారం విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు ఆకుల ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాల పెండింగ్ వేతనం చెల్లించాలి

జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పెండింగ్ లో ఉన్న ఆశా వర్కర్ల గౌరవ వేతనం, ఇన్‌సెంటీవ్ వెంటనే చెల్లించాలని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సాంబశివ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆశా వర్కర్ల జిల్లా కమిటీ సిఐటియు అనుబంధం సభ్యులతో కలిసి ఆయన గురువారం జిల్లా వైద్య అధికారి ఎస్‌వి కృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఆశ వర్కర్లకు గౌరవ వేతనం ఇవ్వలేదన్నారు. గుండుమల పిహెచ్‌సి లో 17 మందికి ఒక నెల గౌరవ వేతనం, రెండు నెలల ఇన్సెంటివ్ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. అలాగే కొన్ని పిహెచ్‌సిల్లో 20 మందికి నాలుగు నెలల నుంచి 7 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించకపతే ఫిబ్రవరి 15 తర్వాత డిఎంహెచ్ఒ కార్యాలయం ముందు బాధితులతో కలిసి వంటా వార్పు కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సౌభాగ్యమ్మ, జిల్లా నాయకురాలు మహాలక్ష్మి, గుండమ్మ, అరుణమ్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం మంజూరు

కొత్తచెరువు : కొత్తచెరువులోని ఎస్సీ కాలనీ ప్రజలకు ధర్మవరం రోడ్డు నందు రైల్వే ట్రాక్ పక్కన శ్మశాన స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారని పంచాయతీ కార్యదర్శి గోపాల్ తెలిపారు. సర్వేనెంబర్ 369 లో 1.75 ఎకరాల స్థలాన్ని మంజూరు చేశారని చెప్పారు.

నేడు వాహనాల వేలం

ఓబుల దేవర చెరువు : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను నల్లమడ సిఐ నిరంజన్ రెడ్డి పర్యవేక్షణలో ఈనెల 20న ఓడి చెరువు పోలీస్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచినవారు రూ.2వేలు డిపాజిట్ నమోదు చేయాలని చెప్పారు.

గృహ లబ్ధిదారులకు రూ. 5 లక్షలు ఇవ్వాలి

ఓబుల దేవర చెరువు : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టిన వారికి ప్రభుత్వం రూ. 5లక్షలు ఇవ్వాలని సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి అంజినేయులు డిమాండ్ చేసారు గురువారం మండలకేంద్రంలోని జగనన్న కాలనీలోని గృహ లబ్ధిదారులను కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చలపతి, రత్నబాయ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

కొత్తచెరువు : స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని కదిరి డిఎల్‌డిఒ శివారెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. మండలంలోని సచివాలయాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఎంపిడిఒకు సూచించారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిద్ధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేపలచెరువు వేలంపాట వాయిదా

గుడిబండ : మండల పరిధిలోని రాళ్లపల్లి పంచాయతీ ముదిగుబ్బ చేపల చెరువు వేలంపాట గురువారం నిర్వహించాల్సి ఉండగా అది వాయిదా పడింది. వేలం పాట నిర్వహణకు ఇఒఆర్‌డి నాగరాజ నాయక్, పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప, సర్పంచి నారాయణప్ప తదితరులు పూనుకున్నారు. అయితే రాళ్లపల్లి పంచాయతీ రైతులు చెరువు తెగిపోయే పరిస్థితిలో ఉందని వేలంపాట అయిన తర్వాత చెరువు తెగిపోతే తమ పరిస్థితి ఏమని ప్రశ్నించారు. చెరువు కట్టను మరమ్మతు చేయించి వేలంపాట నిర్వహించాలని గ్రామస్తులు కోరారు. దీంతో అధికారులకు వేలంపాటను వాయిదా వేశారు. తదుపరి తేదీని ప్రకటిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

ఓబుల దేవర చెరువు : 2023 వ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం గుర్తించినందువలన మండలాలలో చిరుధాన్యాలు సాగును ప్రోత్సహించాలని కదిరి వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ, ఏవో ఇలియాజ్ కోరారు. ఈసందర్భంగా వారు ఇనుగులూరులో రైతు శ్రీనివాసులు సాగుచేసిన పంటను సందర్శించి పలు సూచనలు చేశారు. ఆకుతోటపల్లిలో రంగారెడ్డి సాగుచేసిన క్రాసింగ్ జొన్న పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

పంటను పరిశీలిస్తున్న ఎడి

ఉగాదికి జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు

బత్తలపల్లి : జగనన్న లేఅవుట్లలో నూతనంగా నిర్మించే గృహాల్లోఉగాది పండుగ రోజున గృహ ప్రవేశాలు చేపట్టేలా నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల హౌసింగ్ అధికారి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయా కాలనీల్లో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కలెక్టర్ ఆదేశాల మేరకు తెలుగు సంవత్సరం ఉగాది పండుగ రోజున గృహ ప్రవేశాలు పండుగలా చేపట్టాలన్నారు. అందుకు లబ్ధిదారులు అందరూ తమ గృహాలను సిద్ధం చేసుకోవాలని కోరారు.

ఆధార్ అప్‌డేట్‌కు అవకాశం

బత్తలపల్లి : పదేళ్ల కిందట ఆధార్ కార్డు పొందిన ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డును నమోదు కేంద్రంలో అప్డేట్ చేసుకోవాలని ఎంపిపి గుర్రం వనజ సూచించారు. గురువారం మండలంలోని తంబాపురం, సంజీవపురం గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు బత్తలపల్లి గ్రామ సచివాలయంలో మాత్రమే ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు మరో రెండు ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆదేవిధంగా గ్రామాల్లో ఐదు నుంచి 15 సంవత్సరాలలోపు విద్యార్థులు తమ ఆధార్‌ను అప్డేట్ చేసుకునేలా. మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల్లో తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి మనోహర్, సర్పంచి సానే జయచంద్రారెడ్డి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

హిందూపురం : వాహనాలను నడిపే సమయంలో రోడ్డు ప్రమదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎంవిఐ రమణ సూచించారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం రూరల్ మండలంలోని ఎల్ఆర్‌జి కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబందనలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఆర్‌జి విద్యాసంస్థల సెక్రటరీ బాలసుందరం, ఎఓ సంజీవరెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ భాస్కర్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవులను కాపాడండి

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో దాదాపు మూడులక్షల ఎకరాలలో అడవులు విస్తరించాయని అడవులు కాలిపోకుండా చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన డిఎఫ్ఒకు గురువారం వినతిపత్రం అందజేశారు.

బ్యాంకు సేవలపై కళాజాతా

ధర్మవరం టౌన్ : మండలంలోని చిగిచెర్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చిగిచెర్ల శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు సేవలపై విద్యార్థులకు కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మేనేజర్ చందన మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీజీబీ ముందుందన్నారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ అంజనరెడ్డి, మంజు, నాగేంద్ర, హెచ్ఎం విజయసాయి, ఉపాధ్యాయులు రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

తనకల్లు : మండల కేంద్రంలోని ఇందిరానగర్ కు చెందిన వలి గత కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయని వైద్యులు ధృవీకరించారు. వైద్యం చేయించుకోవడానికి వారి ఆర్థిక పరిస్థితి బాగాలేదని దాతలు ఆదుకోవాలని వారు కోరగా టిడిపి నాయకులు స్పందించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేశారు. అనంతరం మండల పరిధిలోని గుంజువారిపల్లి, ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితమైన మాజీ సింగిల్ విండో డైరెక్టర్ భవాని భర్త రవి పరిస్థితి తెలుసుకున్న టిడిపి మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్ బాధితుడి కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కుంచె నాగేంద్రప్రసాద్, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు తోట సరోజమ్మ, వార్డు మెంబర్ దాము, మాజీ ఎంపీటీసీ బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పెనుకొండ : మండల పరిధిలోని మరవపల్లిలో నిర్మిస్తున్న మైలార లింగేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి బిసి సంక్షేమ సంఘం నాయకులు తనవంతు విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ వారికి జిల్లా బి సి సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీరాములు యాదవ్ గురువారం రూ.5వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొల్ల తిప్పన్న, మల్లయ్య, హనుమంతప్ప, నాగరాజు, మైలప్ప, ఓబులేసు నారాయణ మంజునాథ్ తదతరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో 'శ్రీ చైతన్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ స్థాయిలో నిర్వహించిన కెఎటి ప్రతిభ పరీక్షల్లో హిందూపురం శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ఎఒ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ప్రతిభా విద్యార్థులను గురువారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మోదటి దశలో తమ పాఠశాల విద్యార్థులు 86 మంది పాల్గొనగా 54 మంది అర్హత సాధించారన్నారు. నవంబర్ నెలలో అనంతపురంలో నిర్వహించిన రెండవ దశ పరీక్షల్లో మహమ్మద్ ముజమ్మిల్, మణిత్ సాయి రెడ్డి, తరుణ్‌కృష్ణ ప్రతిభా కనబర్చి నగదు బహుమతి సాధించారన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

హ్యాండ్ బాల్ జట్టుకు 'విజ్ఞాన్' విద్యార్థి

ఓబుల దేవర చెరువు : జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలో ఫక్రొద్దీన్ విజ్ఞాన్ డిగ్రీ కాలేజీ విద్యార్థి మహేష్ ఎన్నియయ్యారు. 13వతేదీ నుండి రెండు రోజుల పాటు గన్నవరంలో జరిగిన 44వ అంతర్ జిల్లా పోటీలలో అనంతపురం జిల్లా జట్టు తరపున పాల్గొన్న మహేష్ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. తమిళనాడులోని తిరుచానూరులో ఈనెల 26 నుంచి 30 వరకు జరగబోయే జాతీయస్థాయి పోటీలలో మహేష్ పాల్గొననున్నాడని అనంతపురం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ముస్తఫా కమల్ బాషా తెలిపారు. విజ్ఞాన్ కాలేజీలో మహేష్ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మహేష్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికకావటంతోకాలేజీ కరస్పాండెంట్ ఫక్రుద్దీన్ , ప్రిన్సిపల్ రామకృష్ణ, బాబా సిబ్బంది అభినందనలు తెలిపారు.

పార్టీ అధిష్టానాన్ని ధిక్కరిస్తే చర్యలు

హిందూపురం : నియోజకవర్గంలో ఇటీవల కాలంలో మూడు గ్రుపులుగా నాయకులు, ప్రజాప్రతినిధులు విడిపోయారని, అందరిని ఏకతాటిపై తీసుకువచ్చి సమన్వయంతో ముందుకు పోతామని పార్టీ అబ్జర్వర్ రెడ్డిశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బి అథితి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో వైసీపీలో మూడు గ్రూపులుగా ఏర్పడి పార్టీకి నష్టం జరుగుతుందన్న ఆలోచనతో సీఎం జగన్ తనను హిందూపురం అబ్జర్వర్ గా పంపారన్నారు. ఆయన ఆదేశాల మేరకు హిందూపురంలో వైసీపీని ఒక గాడిలో పెడతానన్నారు. వచ్చే మార్చి నెలలోపు గ్రూపులన్నిటికీ చెక్ పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వర్గాలుగా విడిపోయి పార్టీకి నష్టం కలిగిస్తే అటువంటి నాయకులపై కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. ఇప్పటికే నియెజక వర్గ వ్యాప్తంగా ఉన్నా అసమ్మతి నాయకులు, అసమ్మతి ప్రజా ప్రతినిధులతో సమగ్రంగా చర్చించి, వారి సమస్యలను తెలుసుకున్నామన్నారు. అందరం కలిసి పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతామన్నారు. త్వరలో ఇన్‌చార్జ్ మంత్రి వస్తారని అన్ని విషయాలు ఆయనకు వివరించి పార్టీని పటిష్టం చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్ శివ, నాయకులు జనర్దాన్ రెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

కదిరి టౌన్ : యోగి వేమన జయంతి ఉత్సవాలకు హాజరైన ప్రముఖులుకదిరి పట్టణంలోని శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంత్రి ఆర్కే రోజా , వైసిపి జిల్లా అధ్యక్షులు మాలగుండ్ల శంకరనారాయణ, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కు కదిరి ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి తన నివాసంలో తేనేటి విందును ఏర్పాటు చేశారు. మంత్రికి వైసిపి నాయకులు సాదిక్‌బాషా, జెడ్పీటీసీ రాధాబాయి, వైసిపి నాయకులు పుష్పగుచ్చాలు అందజేశారు.

ఖర్చు తగ్గించి ఆదాయం పెంచుకోండి

కదిరి టౌన్ : చిన్న మధ్య తరగతి కుటుంబాలు అధిక ఖర్చు తగ్గించి ఆదాయం పెంపొదించుకోవాలని ఎల్‌డిఎం సాయినాథ్ రెడ్డి సూచించారు. మండలం కాట్లాతండాలో ఎపిఎం శారద సహకారంతో ఎల్‌డిఎం సాయినాథ్ రెడ్డి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ వీరమారుతి , నాగప్ప మాట్లాడుతూ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా బ్యాంకులతోనే లావాదేవీలు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకువినోద్, యానిమేటర్ అనంద్‌నాయక్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

'దళితులను విస్మరించిన వైసిపి'

ఓబుల దేవర చెరువు : దళితులను వైసిపి ప్రభుత్వం విస్మరించిందని టిడిపి ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజనేయులు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎస్. గంగాద్రి విమర్శించారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీలకు సంబంధించి రూ.49, 710 కోట్లు ఖర్చు చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గొప్పలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎస్సీలకు ఎక్కడెక్కడ ఏమి అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను కూడా పక్కదారి మళ్లించడం వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. ఈసమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు లక్ష్మణ, దారా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రాష్ట్రంలో ఎస్సీలకు ఎక్కడెక్కడా ఏం అభివృద్ధి చేశారో బహిరంగంగా చెప్పగలరా అనిటీడీపీ ఎస్సీసెల్ సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షులు కేశగాళ్ల శ్రీనివాసులు వైసిపి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం, ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు... సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కర్నాటకలోని మైసూరులో బుధవారం జరిగిన సమావేశంలో రాష్ట్రప్రభుత్వం ఎస్సీలకు సంబంధించి రూ.49,710 కోట్లు ఖర్చుచేసినట్లు గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్పొరేషన్ నిధులను కూడా పక్కదారి మళ్లించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వారం రోజుల క్రితం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులపై హైకోర్టుకూడా ప్రభుత్వాన్ని మందలించిన మాట వాస్తవంకాదా అన్నారు.

ఎటిఎం కార్డు మార్చి నగదు నొక్కేశాడు...

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని సంజీవరాయునిపల్లికి చెందిన పాడి రైతు శ్రీనివాస్ రెడ్డి ఎటిఎంను గుర్తు తెలియని వ్యక్తి దొంగలించి అనంతరం ఎటిఎంలో డబ్బులు డ్రా చేశాడు. దుండగుడు కోడూరు వద్ద ఉన్న నెంబర్ 1 ఎటిఎంలో డబ్బులు డ్రా చేయగానే శ్రీనివాసరెడ్డికి మెసేజ్ వచ్చింది. తన వద్ద ఎటిఎం ఉంటే డబ్బులు ఎవరు డ్రా చేశారని ఖంగు తిన్నాడు. వెంటనే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. అనంతరం తన వద్ద ఉన్న ఎటిఎంను చెక్ చేసి అది తనది కాదని గుర్తించాడు. ఎటిఎం మార్పిడి ఎక్కడ జరిగిందో తనకు అంతుచిక్కలేదని బాధితుడు లబోదిబో మంటున్నాడు. ఈనేపథ్యంలో కోడూరు నెం 1 ఎటిఎంలోని సిసిటీవీ ఫుటేజీని పరిశీలించగా దుండగుడు తెలివిగా మాస్క్ ధరించి డబ్బులు డ్రా చేసుకున్నట్లు కన్పించింది. నిందితుడి పట్టుకొని డబ్బును ఇప్పించాలని బాధితుడు కోరుతున్నాడు.

ఎటిఎంలో నగదును డ్రా చేస్తున్న అగంతకుడు

వైద్యం అందక పిహెచ్‌సిలో రోగి మృతి

అమరాపురం : ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన సమయంలో వైద్యం అందక రోగి మృతిచెందిన సంఘటన అమరాపురంలో చోటు చేసుకుంది. గురువారం జరిగిన ఈఘటనకు సంబంధించి మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు...కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన వెట్టి నాగరాజు అనే వ్యక్తికి అమరాపురం మండలం కాచిగుంట గ్రామానికి చెందిన మహిళతో గతంలో వివాహమైంది. ఈ నేపథ్యంలో నాగరాజు మూడు రోజుల క్రితం అత్తగారి గ్రామమైన కాచిగుంటకు వచ్చాడు. ఈసందర్భంగా నాగరాజుకు జ్వరం వచ్చింది.ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నాడు. అయితే జర్వం తగ్గలేదు. తీవ్ర అస్వస్థతకు గురైన నాగరాజును గురువారం 108 ద్వారా అమరాపురం ఆసుపత్రికి తరలించారు. రోగిని ఆసుపత్రికి చేర్చి రెండు గంటలైనా వైద్యాధికారి రాలేదు. దీంతో నాగరాజు (60) మృతిచెందాడు. ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడంతో సరైన సమయంలో వైద్యం అందక తన భర్త మృతిచెందాడని మృతుని భార్య సన్న లింగమ్మ ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రికి ఇద్దరు డాక్టర్లు ఉన్నా వారు రోగులకు అందుబాటులో లేకపోవడం వలనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

కొత్తచెరువు : మండల కేంద్రంలోని బసవన్న కట్టవీధిలో గురువారం అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందింది. బాధితులు పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం పావగడకు సమీపంలో అప్పాచిపల్లి చెందిన రాజారెడ్డి, ఆయన భార్య నందిని(20) రెండు నెలల క్రితం కొత్తచెరువుకు వచ్చి బసవన్న కట్ట వీధిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. రాజారెడ్డి తాగునీటి ట్యాంకర్ కు డ్రైవర్ గా విధులు నిర్వర్తించి కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాజారెడ్డి అధికంగా మద్యం తాగి భార్య తో గొడవపడి తీవ్రంగా కొట్టాడు. తీవ్ర గాయాలతో మృతిచెందిందా లేక ఫ్యాన్‌కు ఉరివేసి చంపారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గాయాల పాలై సహ తప్పి పడిపోయిన మహిళను పరిసర ప్రాంతాల వారు గమనించి కొత్తచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నందిని అప్పటికే మృతిచెందిందని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో పోలీసులు మృతురాలి భర్తను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మహిళ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. మృతురాలికి ఎనిమిది నెలల కూతురు ఉంది.

ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు

బత్తలపల్లి : తనకు ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని బాధితుడు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అందుకు సంబందించిన బత్తలపల్లిలోని ఆర్డీటి ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న బాధితుడు రెడ్డి మోహన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాలు... అన్నమయ్య జిల్లా పీలేరు మండలం దేవలవారిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి మోహన్‌రెడ్డి 19 సంవత్సరాలుగా బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రిలో ఉద్యోగరీత్యా ఇక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు స్వగ్రామంలో వ్యవసాయ భూమి ఉండగా, దానిపైన ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. గత ఏడాది డిసెంబర్ 13న సాయంత్రం తన స్వగ్రామానికి చెందిన ద్వారకనాథరెడ్డి అను వ్యక్తి ఫోన్ చేసి తన కుటుంబాన్ని చంపుతామని జయరామిరెడ్డి, ఆనందరెడ్డి ప్రోద్భలంతో బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై ఇప్పటికే 13 కేసులున్నాయని మిమ్మల్ని చంపుతే తనకు 14వ కేసు అవుతుందని అక్కడే నివసిస్తున్న తన తల్లి రెడ్డెమ్మను బెదిరిస్తున్నారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. మోహన్ రెడ్డి పిల్లలు విద్యాభ్యాసం చేస్తూ ఇతర రాష్ట్రాల్లోనూ, చెల్లెలు బ్రతుకు తెరువు రీత్యా ఇతర రాష్ట్రాల్లో జీవిస్తున్నారని వారందికీ ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన కుటుంబ సభ్యులకు ఎలాంటి హాని జరిగినా వారే బాధ్యులని అంటున్నారు.ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్

సర్వే పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని సర్వేనెంబర్లు 508, 515-2, 582, 639-1, 515 -3లోని భూముల సర్వే పనులు వేగవంతం చేయాలని సచివాలయ ఉద్యోగులకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్లో సచివాలయ అడ్మిన్, రెవిన్యూ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 08 సర్వేనెంబర్లలో సర్వే వివరాలను తెలపాలని కలెక్టర్ కార్యాలయం ద్వారా ఉత్తర్వులు వచ్చాయని అందుకే సమావేశం నిర్వహించామని చెప్పారు. ఆయా సర్వే నెంబర్లలో నివాసగృహాలు, కమర్షియల్ ఖాళీస్థలాలు తదితరవివరాలను పూర్తిస్థాయిలో తెలపాలని కమిషనర్ సూచించారు. ఆయా స్థలాలలో సర్వహక్కుపత్రం కలిగించేందుకు ఆర్డీవో చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ, డీఈ వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుని ఆలయంలో మంత్రి రోజా

ప్రజాశక్తి కదిరి అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి ఆర్.కె.రోజా ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని గురువారం దర్శించుకున్నారు. గురువారం గాండ్లపెంట మండలంలోని కటారుపల్లి గ్రామంలో శ్రీ యోగి వేమన జయంతి కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈనేపథ్యంలో ఆమె కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ప్రధాన అర్చకులు, ఆలయ ఈవో గురుప్రసాద్, చైర్మన్ గోపాలకృష్ణ, ట్రస్టు సభ్యులు తదితరులు మంత్రి రోజా, ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రికి సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వైసీపీ నాయకులు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఖాద్రీశుడి ఆలయంలో వైసిపి నాయకులతో మంత్రి రోజా

నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

వైసిపి పాలనలో రాష్ట్రం నాశనం : పల్లె

ప్రజాశక్తి - కొత్తచెరువు

జగన్ పాలనతో రాష్ట్రం అథోగతి పాలైందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని ఇరగంపల్లి, వంగంపల్లి గ్రామాలలో గురువారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ఇళ్ల నిర్మాణాల్లో ప్రభుత్వం ఇస్తున్న రుణం సరిపోక ఇల్లు నిర్మించుకోవడానికి ఎవరు ముందుకు రాలేదన్నారు నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్న ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నాయన్నారు రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు తిరగకుండా జీవో నెంబర్ ఒకటి తీసుకొచ్చి ప్రతిపక్షాలని అనగతొక్కడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వారికి సబ్సిడీ విత్తనాలు ఎరువులు డ్రిప్పు పరికరాలు తక్షణమే అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు నాగేందర్ ప్రసాద్ రామ్మోహన్ సుబ్రహ్మణ్యం గురప్ప, బోయ రాజు తదితరులు పాల్గొన్నారు

వేమన సామాజిక చైతన్యానికి స్ఫూర్తి

పెనుకొండ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, తదితరులు

పెనుకొండ : వేమన సామాజిక చైతన్యానికి స్ఫూర్తి అని పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్, ఎజిపిఎం భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం యోగి వేమన జయంతి ఉత్సవాలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నుండి ప్రారంభమైన ర్యాలీని సబ్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ భువన విజయం నందు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన వేమన జయంతి ఉత్సవాలలో భాగంగా యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వేమన ఫౌండేషన్ అధ్యక్షులు మారుతి ప్రసాద్ రెడ్డి అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సబ్ కలెక్టర్ కె. కార్తీక్, ఎజిపిఎం భాస్కర్ రెడ్డి, విశిష్ట అతిథిగా తహశీల్దార్ స్వర్ణలత, తెలుగు లెక్చరర్ దేవిశెట్టి రామన్న, రాజనీతి శాస్త్ర ఉపన్యాసకులు రాజశేఖర్ రెడ్డి, వేమన సంక్షేమ సంఘం నాయకులు, మండలంలోని రెడ్ల సంఘం నాయకులు, రెడ్డి సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా యోగి వేమన జయంతి ఉత్సవాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, రెడ్డి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ప్రజాకవి యోగివేమన రచించిన రచనలను సమాజంలో ఆదర్శంగా తీసుకోవాలని ధర్మవరం శాఖా గ్రంథాలయ అధికారిణి సౌభాగ్యవతి కోరారు. యోగివేమన జయంతిని పురష్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో గురువారం వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, నాయక్, శివమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : శాఖ గ్రంథాలయంలో యోగివేమన జయంతి వేడుకలను గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అటెండర్ వెంకటరమణ, సిబ్బంది మునీరు, పాఠకులు మహమ్మద్, వెంకటరమణప్ప, రమేష్, రామాచారి, వెంకటప్ప, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఇబ్రహీం ఆధ్వర్యంలో వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో సీనియర్ సాహితీ వేత్తలు గంగరాజు, సాంబశివుడు, ఉపాధ్యాయులు భాస్కర్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ఆధునిక సమాజంలో విలువలతో కూడిన సమాజం నిర్మించడానికి, తన రచనలతో మూఢనమ్మకాలను రూపుమాపడానికి యోగి వేమన చేసిన కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ ఇక్బాల్ పేర్కొన్నారు. వేమన జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్సీ తన కార్యాలయంలో వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ముదిరెడ్డిపల్లిలో వేమరెడ్డి సంఘం ఆధ్వర్యంలో వేమన చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ అశ్వర్థరెడ్డి, ఆడిటర్ చంద్రశేఖర్ రెడ్డి, న్యాయవాది రామచంద్ర రెడ్డి, కౌన్సిలర్ మారుతి రెడ్డి, సప్తగిరి ఈశ్వర్ రెడ్డి, చౌళూరు నంజుండ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, నాగభూషణ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, సడ్లపల్లి శ్రీనివాస రెడ్డి, మధుసూదన రెడ్డి, రంగధామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముదిరెడ్డిపల్లిలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, రెడ్డి జెఎసి జిల్లా అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ నాగభూషణ్ రెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, నరసింహారెడ్డి, శివారెడ్డి, పెద్ద ఎత్తున రెడ్డి సోదరులు, మహిళలు పాల్గొన్నారు.